క్లుప్తంగా

నేడు ఆమనగల్లులో బైక్ ర్యాలీ

ఆమనగల్లు: పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు అయ్యప్ప మహా పడిపూజ

ఆమనగల్లు: పట్టణంలోని కొండపై వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప మహాపడిపూజలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా భజన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆమనగల్లు: పట్టణ సమీపంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన పోటీలు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు చెందిన సీతారామాంజనేయ, మిడ్జిల్‌కు చెందిన ఈదమ్మతల్లి, తలకొండపల్లికి చెందిన చెన్నకేశవ స్వామి, లేమామిడికి చెందిన అమృత లింగేశ్వరస్వామి, ఆమనగల్లుకు చెందిన అభయాంజనేయస్వామి, జంగారెడ్డిపల్లికి చెందిన భవానీ రామలింగేశ్వర భజన బృందాలు పాల్గొన్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పరమేశ్‌గౌడ్, ఆంజనేయులు యాదవ్, వివేకానంద, రాములు, మల్లేశ్, తిరుపతి, యాదగిరి, గంగారవి, శ్రీను, వెంకటేశ్, మల్లేశ్, జయరాం, కొండల్, రామచంద్రయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంతాపం తెలిపిన నేతలు



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న క్యామ మల్లేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, రాయపోల్ గ్రామ మాజీ సర్పంచ్ పాశం అశోక్‌గౌడ్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి పాశం జంగయ్యగౌడ్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ గ్రామానికి వెళ్లి జంగయ్య మృతికి సంతాపం తెలిపారు. అశోక్‌గౌడ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత



మన ఊరు మన చెరువు కార్యక్రమంలో యూత్ సభ్యులు, కార్మికులు

తుర్కయంజాల్: చెరువులు, కుంటలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని పురపాలక సంఘం పరిధి బ్రాహ్మణపల్లికి చెందిన హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు బాలు, ప్రవీణ్, ఆకాష్‌లు అన్నారు. మన ఊరు మన చెరువు కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రాహ్మణపల్లిలోని చెరువులో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను మున్సిపల్ కార్మికులతో కలిసి తొలగించారు. నీటి వనరుల్లో వ్యర్థాలను వేసి పర్యావరణ కాలుష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

కేశంపేట: దైవచింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎల్గనమోని అంజయ్యయాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో శ్రీశ్రీశ్రీ భూదేవి, శ్రీదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం దేవాలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దంపతులు, మాజీ ఎంపీపీ ఎల్గనమోని రవీందర్‌యాదవ్ దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హోమం నిర్వహించడంతో శాంతి, ఐశ్వర్యం, కార్యసిద్ధి కలుగుతుందన్నారు.

ఏసీపీ కార్యాలయం కలేనా!

- ఏడాదిన్నరగా ప్రతిపాదనలకే పరిమితం
- నాలుగు మండలాల ప్రజలకు ఇబ్బంది



ఆమనగల్లు పోలీస్‌స్టేషన్

ఆమనగల్లు: పట్టణంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏడాదిన్నర నుంచి కేవలం ప్రతిపాదనలకే పరిమితమైంది. గతంలో ఏర్పాటవుతుందని హడావుడి జరిగినా కార్యరూపం మాత్రం దాల్చలేదు. దీంతో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు కలిపి ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కొన్ని నెలలుగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు మొర పెట్టుకుంటున్నారు.

రెండు కమిషనరేట్ల పరిధిలో..

జిల్లాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలను మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లాలో కలిపారు. ఇందులో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండగా.. మాడ్గుల పోలీసు స్టేషన్ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఉంది. నాలుగు మండలాలను ఒకే కమిషనరేట్ పరిధిలో ఉంచాలని లేదా నాలుగు మండలాలను కలిపి ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని అప్పట్లో డిమాండ్ వినిపించింది. ఒకే అసెంబ్లీ నియోజకవర్గంలోని నాలుగు మండలాలు రెండు కమిషనరేట్ పరిధిలో ఉండటంతో పాలనాపరమైన ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు ప్రజాప్రతినిధులకు కూడా ఇబ్బందిగా మారింది.

కార్యాలయం ఏర్పాటుకు హామీ

ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి పోలీసు స్టేషన్‌లు షాద్‌నగర్ ఏసీపీ పరిధిలో, మాడ్గుల పోలీసు స్టేషన్ ఇబ్రహీంపట్నం ఏసీపీ పరిధిలో ఉండగా నూతనంగా ఇక్కడ ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఆమనగల్లుకు షాద్‌నగర్ ఏసీపీ కార్యాలయం 50 కిలోమీటర్లు, మాడ్గులకు ఇబ్రహీంపట్నం 40 కిలోమీటర్ల దూరం ఉండటంతో ప్రజలు కార్యాలయానికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల ముందు కడ్తాల్ మండల కేంద్రంలో నూతన పోలీసు స్టేషన్ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి హోంశాఖామంత్రి మహమూద్ అలీ, అప్పటి డీజీపీ అంజన్‌కుమార్‌లు ఆమనగల్లులో ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

స్థానిక నేతలదే బాధ్యత

ఏసీపీ ఆఫీస్ ఏర్పాటుకు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. ఇందుకు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు చొరవ చూపాలని వినతులు వెలువెత్తుతున్నాయి. జిల్లాల పునర్విభజన అనంతరం ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కార్యాలయం ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు ఆసక్తి చూపాలి.

ప్రజలను విస్మరించిన బీజేపీ

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్ అధ్యక్షతన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహణపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నియంత పోకడలతో ప్రజలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాల రాస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలను, రాజ్యాంగం గొప్పతనాన్ని ప్రజలకు వివరిస్తూ రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సత్యం, నర్సింహ, ఆనంద్‌నాయక్, సుదర్శన్, బాల్‌రెడ్డి, వెంకటేశ్, వినోద్, శ్రీను, అలీమ్, నాజర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే మార్పు సాధ్యం

- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్
- మహనీయుల విగ్రహాల శుద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్



మహనీయుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

మంచాల: బీజేపీతోనే మార్పు సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు నూకం రాజు ముదిరాజ్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలకడం తప్పా చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో పరిపాలన కొనసాగించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలంటే బీజేపీతోనే సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య, నాయకులు జంగయ్యగౌడ్, శ్రీశైలం, కొండల్, ప్రకాశ్, పాండు, వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, రాజు, నర్సింహారెడ్డి, జనార్దన్‌రెడ్డి, అరుణమ్మ, జయశ్రీ, భిక్షపతి, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

విగ్రహాల శుద్ధి

బీజేపీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని మహనీయుల విగ్రహాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను శుద్ధి చేశారు. ఆరుట్ల గ్రామంలో సేవా భారతి సంస్థ ఆధ్వర్యంలో విగ్రహాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్, నాయకులు లచ్చిరెడ్డి, బాషయ్య, శ్రీశైలం, జంగయ్యగౌడ్, కొండల్, పాండు, భిక్షపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు తరలిరండి



రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం

కడ్తాల్: బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సాధించిన తర్వాత అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసిగిపోయారన్నారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీ, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమయిందని ఆరోపించారు. ప్రజలంతా మళ్లీ బీఆర్‌ఎస్ పాలనను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నెల 27న వరంగల్ సభలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై, ఉద్యమ కార్యచరణకు దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. సభకు కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతి పల్లె, తండా, గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చేలా సమన్వయంతో కార్యకర్తలు పనిచేయాలని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ రజతోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, విజితారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు అర్జున్‌రావు, లచ్చిరామ్‌నాయక్, పత్యానాయక్, జోగు వీరయ్య, నర్సింహగౌడ్, గోపాల్‌గౌడ్, రమేశ్, రామకృష్ణ, లాయక్‌అలీ, పాండు, శంకర్, శ్రీనునాయక్, అంజి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు పరామర్శ

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, రాష్ట్ర చెంచు యువజన సంఘం అధ్యక్షుడు మండ్లి రాములు మాతృమూర్తి మండ్లి జంగమ్మ ఆదివారం మృతిచెందారు. మండలం శంకరకొండతండాలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. అనంతరం రాములును పరామర్శించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాల ఏర్పాటు



ఆరుట్లలో రక్తదాన శిబిరంలో నాయకులు

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆరుట్లలో సేవా భారతి తరపున దక్కన్ బ్లడ్‌సెంటర్, లయన్స్‌క్లబ్ సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. 50 మందికి పైగా యువకులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, కృష్ణ, నరేందర్, శ్రీకాంత్, రాము, బి.రమేశ్ సేవా భారతి సభ్యులు హరీష్, రాజవర్ధన్‌రెడ్డి, అజయ్ పాల్గొన్నారు.

కాగజ్‌ఘట్‌లో..

వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌ఘట్‌లో ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు సంగం బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉచితంగా 100 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 20 మందిని ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. మరోవైపు 30 మంది రక్త దానం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వన్ ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కాలనీ కార్యవర్గ సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి మునగనూర్‌లోని టెలిఫోన్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.సౌజన్య భారతి, గౌరవ అధ్యక్షుడిగా పి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి జె.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా నాగార్జున చౌదరి, రవిచంద్ర, మదనాచారి, నరేందర్, శివ, సంయుక్త కార్యదర్శులుగా సునీతారెడ్డి, మాధవ్, రంగారెడ్డి, రంజిత్, రామకృష్ణ, రాహుల్, సలహాదారులుగా జి.గాంధీ, ప్రత్యేక సలహాదారుడు డా.సురేశ్, కమ్యూనికేషన్ ఇన్‌చార్జి సంపత్, కార్యవర్గ సభ్యులుగా జి.శ్రీనివాసరావు, రామారావు, నాగరాజు, విమల్, వెంకటేష్, అరవింద్ తదితరులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డీసీసీ జనరల్ సెక్రటరీ తమలపాకుల హర్షలత, మాజీ కౌన్సిలర్ నక్క శివలింగం గౌడ్, నాయకులు మోహన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రామచంద్రస్వామి రథోత్సవంలో భక్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో శ్రీరామచంద్రస్వామి రథోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా రథాన్ని లాగారు. ఈ దృశ్యాలు కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్వర్



డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్వర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో శ్రీదత్త విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా పోలీసులు, కళాశాల అధ్యాపకులు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి సీఐ జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ బెట్టింగ్స్‌తో విద్యార్థుల జీవితాలు ఆగమైపోతున్నాయన్నారు. వాటి జోలికి పోవద్దని సూచించారు. ప్రస్తుతం ఎక్కడ చూసిన డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందన్నారు. జీవితాలు పాడుచేసుకొని తల్లిదండ్రుల ఆశయాలను ఆవిరి చేస్తున్నారని చెప్పారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ లాంటి విషయాలను పట్టించుకోకుండా దూరంగా ఉండాలన్నారు. నార్కోటిక్స్, డ్రగ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సీఐ వివరించారు. అనంతరం కళాశాల డీన్ అచ్యుతారావు మాట్లాడుతూ.. స్టూడెంట్స్ టెక్నో కల్చరల్ ఫెస్ట్ ఇన్ఫినిటీ 2కె25లో భాగంగా ఐదు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శేరిగూడలో పీసీసీ అధ్యక్షుడి సందడి



పూజలో మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులు

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ శేరిగూడలో పర్యటించారు. స్థానికంగా ఉండే తాళ్ల కైలాష్‌పతిగౌడ్ నివాసంలో నిర్వహించిన ఎల్లమ్మ పండగకు మహేశ్‌కుమార్‌గౌడ్ దంపతులు విచ్చేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, బాలశివుడుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


మంచాల: మండల పరిధిలోని జాపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2009–10 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఓ చోటుకు చేరుకున్నారు. 16 ఏళ్ల తరువాత కలుసుకోవడంతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నీటిని తోడేసి.. కాసులు పోగేసి!

- పక్కదారి పడుతున్న ఉచిత విద్యుత్
- పొలాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటి తరలింపు
- ఒక్కో ట్యాంకర్ రూ.2 వేల నుంచి రూ.3 వేలకు విక్రయం
- సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు



రావిర్యాలలో సరఫరాకు వెళ్తున్న ట్యాంకర్

తుక్కుగూడ: రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పక్కదారి పడుతోంది. కొందరు అక్రమార్కులు తమ స్వార్థానికి అనుకూలంగా మార్చుకుంటున్నారు. వ్యవసాయ బోరుబావులకు యథేచ్ఛగా ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తూ.. వాటి నుంచి నీటిని తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రూ.లక్షల్లో కరెంట్ బిల్లుకు గండి కొడుతున్నారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్, ఇమామ్‌గూడ, తుక్కుగూడ, రావిర్యాల, సర్దార్‌నగర్‌లో శ్రీశైలం జాతీయ రహదారిపై రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరాయంగా దందా కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు.

వాల్టా చట్టానికి తూట్లు

మున్సిపాలిటీ పరిధిలోని రియల్ వ్యాపారులు చేసే వెంచర్ల ఏర్పాటు, భవనాల నిర్మాణాలతో పాటు, ఈ–సిటీ, హార్డ్‌వేరు పార్కు, మంఖాల్ పారిశ్రామిక వాడలో వందలాది పరిశ్రమలు ఉండటంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిని ఆసరాగా చేసుకొని కొందరు తమ ట్యాంకర్ల ద్వారా రోజుకు వేల లీటర్ల నీటిని విక్రయిస్తూ.. కాసులు దండుకుంటున్నారు. ప్రస్తుతం ఎండల మండుతున్న తరుణంలో భూగర్భజలాలు తగ్గి నీటి కొరత రావడంతో విచ్చలవిడిగా రెట్లు పెంచుతున్నారు. ఒక్కో ట్యాంకర్ రూ.2 వేల నుంచి రూ.3 వేలను వసూలు చేస్తున్నారు. బోర్లలు ఎండిపోవడంతో వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ కొత్త బోర్లు వేస్తున్నారు. మున్సిపాలిటీలో రోజుకు లక్షల రూపాయాల నీటి వ్యాపారం కొనసాగుతోంది. రెండు, మూడు నెలల నుంచి భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిన జాబితాలో మహేశ్వరం మండలం ప్రథమ స్థానంలో ఉండి హెచ్చరికలు జారీ చేస్తోంది.

రూ.లక్షల ఆదాయానికి గండి

వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ తీసుకొని వ్యవసాయేతర పనులకు ఉపయోగిస్తుండటంతో ట్రాన్స్‌కో ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. విద్యుత్ చౌర్యంపై కేసులు నమోదు చేసే అధికారులకు ఆ విషయం పట్టించుకోక పోవడం గమనార్హం. ఉచిత విద్యుత్ దోపిడీకి గురవుతున్నా కింద స్థాయి సిబ్బంది ట్యాంకర్ల నిర్వాహకుల దగ్గర ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు ఉచిత విద్యుత్ దుర్వినియోగంపై పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్పందించి నీటి వ్యాపారం చేస్తున్న బోర్లను పరిశీలించి తగ్గిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఫిర్యాదు చేశాం

మహేశ్వరం మండలం, తుక్కుగూడ పురపాలిక సంఘం పరిధిలోని వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి వ్యాపారం చేస్తున్నారు. రోజూ లక్షల లీటర్ల నీరు సరఫరా చేయడంతో భూగర్భజలాలు తగ్గుతున్నాయి. నాలుగేళ్ల నుంచి వేసవికాలంలో పుర అధికారులకు ఫిర్యాదు చేశాం. ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ధనుంజయ్, ఇమామ్‌గూడ

కేసులు నమోదు చేశాం

ఉచిత విద్యుత్ వ్యవసాయ పనులకు మాత్రమే. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు వాడుకోవద్దు. అక్రమంగా నీటిని తరలిస్తూ.. ఉచిత విద్యుత్ దుర్వినియోగం చేస్తే కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పటివరకు ఎనిమిది కేసులు నమోదు చేశాం.

– చక్రపాణి, విద్యుత్ ఏఈ, మహేశ్వరం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386